క్లుప్తంగా

రేపు మెగా జాబ్‌మేళా

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువతి, యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



షాద్‌నగర్: పట్టణంలోని పటేల్ రోడ్డుకు చెందిన కండె నరేష్ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన బెజుగం రమేష్, యంసాని శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, బొంతపల్లి విద్యాసాగర్, కట్టా కృష్ణయ్య, గార్లపాటి శంకర్, నవీన్, కొల్లూరు శేఖర్ శుక్రవారం నరేష్‌కు రూ. 25వేలు ఆర్థిక సాయం చేశారు.

శివాలయంలో అభిషేక పూజలు



పూజలు చేస్తున్న వాసుదేవ్ దంపతులు

శంకర్‌పల్లి: మండలంలోని చందిప్ప గ్రామంలో వెలసిన మరకత శివాలయంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్ ఖన్నా, అశ్విని దంపతులు శుక్రవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులను అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చందిప్ప మరకత శివాలయంలో పూజలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వాసుదేవ్‌కు చిత్రపటం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సదానందంగౌడ్ పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్ అభివృద్ధికి జెడ్పీ నిధులు



నిధులు మంజూరు పత్రాన్ని అందుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల అభివృద్ధికి జిల్లా పరిషత్ నిధులు రూ. 24లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. నిధుల మంజూరుకు సంబంధించి పత్రాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో శ్మశానవాటికల్లో బోర్లు, సీసీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

షాద్‌నగర్: కేశంపేట మండలం లేమామిడి గ్రామంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమన్‌గల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం అయ్యింది. ఈ శిబిరాన్ని సర్పంచ్ శ్రీశైలం గౌడ్ ప్రారంభించారు. 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి తాహసిల్దార్ కృష్ణ, వైశాలి, మన్మధరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జహంగీర్, సంపంగి బాల్‌రాజ్, లోకేష్, రవి, నాయక్, నందు, అంజి, రవి, హరిశంకర్, రాజేశ్వర్, మోహన్‌రెడ్డి, డాక్టర్ విజయ్, లింగేష్, ఏఈఓ సుధ తదితరులు పాల్గొన్నారు.

బాకారంలో వీరనరసింహారెడ్డి యూనిట్

మొయినాబాద్ రూరల్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం బాకారం సమీపంలోని గ్రీన్ వ్యాలీ రిసార్ట్‌కు శుక్రవారం వీర నరసింహారెడ్డి సినిమా యూనిట్ వచ్చింది. రోడ్డు మార్గంలో హీరో బాలకృష్ణ, హీరోయిన్ శృతి హాసన్, దర్శకుడు బీ గోపాల్, నిర్మాత నవీన్ ఎర్నేని ఇక్కడికి వచ్చారు. ఇక్కడ నుంచి ఏర్పాటు చేసిన హెలిక్యాప్టర్‌లో ఏపీలోని ఒంగోలులో జరిగే వీరనరసింహారెడ్డి సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు బయలుదేరి వెళ్లారు. హెలిక్యాప్టర్ వద్ద హీరో, హీరోయిన్ కొద్దిసేపు ముచ్చటించారు.

లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం



వినియోగంలో లేని చేవెళ్ల రైతుబజార్

- నిరుపయోగంగా రైతుబజార్
- వృథాగా షెడ్లు
- రోడ్లపైనే క్రయ విక్రయాలు
- తిరిగి ప్రారంభించాలంటున్న ప్రజలు

చేవెళ్ల: మండల కేంద్రంలో రైతులు, వినియోగదారుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతుబజార్‌ను వినియోగించడం లేదు. దీంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. దాదాపు 40 మంది ఇక్కడ వ్యాపారం చేసుకునేందుకు షెడ్లు నిర్మించారు. సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలకు రోడ్లు వేశారు. కానీ రైతుబజార్‌లో ఎలాంటి వ్యాపారాలు కూడా సాగడం లేదు. ప్రారంభ సమయంలో రైతుబజార్.. వ్యాపారులు, కొనుగోలు దారులతో కళకళలాడేది. ఆ తరువాత వ్యాపారులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక చేసేదేమీ లేక కొనుగోలు దారులు కూడా ఇక్కడికే వస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో మాత్రం బయట దుకాణాలు బంద్ కావడంతో రైతుబజారులోనే కూరగాయల కొనుగోలు చేసేవారు. లాక్‌డౌన్ ఎత్తేసిన తర్వాత యాధావిధిగా రోడ్లపైనే విక్రయాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రైతుబజారును ఉపయోగించుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

రైతుబజారు కట్టినా ప్రయోజనం లేదు



లక్షలాది రూపాయలతో నిర్మించిన రైతుబజారు నిరుపయోగంగా మారింది. రైతులంతా ఒక చోట ఉంటేనే గిరాకి వస్తుంది. కూరగాయలు విక్రయించి చిరు వ్యాపారులంతా రైతుబజారును ఉపయోగించుకోవాలి. అధికారులు, నాయకులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– వీరేశం, రైతు, కుమ్మెర గ్రామం

వినియోగంలోకి తెస్తాం



చేవెళ్లలో ప్రజల కోసం ప్రభుత్వం రైతుబజార్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని ఉపయోగించుకోకుండా రోడ్లపై విక్రయాలు చేయటం సరికాదు. మార్కెట్ కమిటీ పాలకవర్గం దీనిపై చర్చించి రైతుబజార్‌ను ఉపయోగించుకునేలా చూస్తాం. రైతుబజార్ కార్డులు ఉన్నవారు రోడ్లపై కూరగాయలు విక్రయిస్తే వారి కార్డులను రద్దు చేస్తాం.

– వెంకటరంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, చేవెళ్ల

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్

బీజేపీ నియోజకవర్గ ప్రబారి శివరాజ్

షాద్‌నగర్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంలో నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నియోజకవర్గ ప్రబారి శివరాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దొడల వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివరాజ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామస్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల బూత్ కమిటీలతో పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా వర్చువల్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని శనివారం పట్టణ శివారులోని కుంట రాంరెడ్డి గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహ్మ, ఎంకోళ్ల వెంకటేష్, లష్కర్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు

మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్

షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను వైస్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, మెరుగైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధికి నిధులు విడుదల చేస్తోందని వివరించారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న నేతలు

పుస్తకాల సరఫరాలో సర్కారు విఫలం

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

షాద్‌నగర్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయి పాఠ్యపుస్తకాలు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా చాలా పాఠశాలలకు పుస్తకాలు అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతోందని మండి పడ్డారు. విద్యార్థి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు తుప్పరి కుమార్, పోమాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు షాద్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను పేదలకు అందజేయడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. కానీ వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు రూ. 26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే సీఐటీయూ పోరాటం చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయిబాబ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనునాయక్, నాయకులు ఈశ్వర్‌నాయక్, జయమ్మ, ఊర్మిళ, రత్నమ్మ, సంగీత, సబేరా, తులసీ, శారద, జయప్రద పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సుదర్శన్

శంకర్‌పల్లి: టీయూటీఎఫ్ శంకర్‌పల్లి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్‌పాషా ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా ఏ సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, గౌరవ అధ్యక్షుడిగా దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరేందర్‌రెడ్డి, రఫీకాబేగం, ఆర్థిక కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు అంటూ కాలం వెల్లదీస్తున్న ప్రభుత్వం వెంటనే ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ, మెడికల్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా కార్యదర్శి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, జగదీశ్వర్, రాముశర్మ, వరప్రసాద్, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా అనంతయ్య ఎన్నిక



అనంతయ్య

షాద్‌నగర్ రూరల్: మహాజన సోషలిస్టు పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చిన్నోళ్ల అనంతయ్య మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంతయ్యకు రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాలపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన హంగులతో చేవెళ్ల బస్టాండ్

ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



బస్టాండ్ డిజైన్లను పరిశీలిస్తున్న ఎంపీ

చేవెళ్ల: అధునాతన హంగులతో చేవెళ్ల బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం బస్టాండ్ డిజైన్‌లపై ఆర్కిటెక్ అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చేవెళ్లలో రూ. 3కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో 2.5 ఎకరాల స్థలంలో అధునాతన హంగులతో బస్ స్టేషన్ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు చూపిన డిజైన్లను పరిశీలించిన ఫైనల్ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ, ఆర్కిటెక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తగ్గించండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా

మీర్‌పేట: అధిక ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి వెంకటగిరి కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అధిక పన్నులు, నీటి బిల్లుల గురించి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

బాధితులకు న్యాయం చేయండి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్



దుకాణ బాధితులతో కలసి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కొత్తూరు: జేపీ దర్గా ఆవరణలో రోడ్డు విస్తరణ కారణంగా దుకాణాలు తొలగించారని, బాధితులకు వెంటనే న్యాయం చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిలపక్ష నాయకులతో కలిసి ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం దుకాణాలను తొలగించడం దారుణమన్నారు. రోడ్డు విస్తరణ కోసం స్థానిక వ్యాపారులు సహకరించి కొద్దిమేర కట్టడాలను తొలగించినప్పటికీ ఉద్దేశపూర్వకంగా మొత్తం నిర్మాణాలను తొలగించడం బాధాకరమన్నారు. దుకాణాల తొలగింపుతో వారు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. దీనికి ఆయా శాఖల అధికారులే బాధ్యత వహించాలన్నారు. దర్గా ఆవరణలో ప్రభుత్వం తరఫున చేపట్టే అభివృద్ధి పనులను స్వాగతిస్తామని.. అదే సమయంలో ప్రైవేటు వ్యక్తుల కోసం వ్యాపారులను ఇబ్బంది పెడితే మాత్రం ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కేవలం స్టోన్ క్రషర్ నిర్వాహకుల కోసమే పేదల నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో బాధితులకు అండగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ రాజు, పానుగంటి పర్వతాలు, రఘు, రవికుమార్ గుప్తా, బాబార్‌ఖాన్, గణేష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

భూపరిహారం అందేవరకు పోరాటం



హైతాబాద్‌లో ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

షాబాద్: తాము భూములు కోల్పోయినా పరిహారం అందలేదని అది వచ్చేదాకా పోరాటం చేస్తామని చందనవెల్లి భూ నిర్వాసితులు సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు పేర్కొన్నారు. హైతాబాద్‌లో చేపట్టిన భూ నిర్వాసితులు ఆందోళన శుక్రవారం నాటికి 160వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చందనవెల్లి, హైతాబాద్ గ్రామాల రైతులు భూములు తీసుకున్న సర్కారు ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులే ఇందుకు కారణమని ఆరోపించారు. వెంటనే పరిహారం అందేలా చూడాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు అంతయ్య, శోభ, రంగం, రెడ్డయ్య, బాలయ్య, హనుమంతు, గిరిగాబు, రాంబాబు, అనంతయ్య, నర్సింహులు, భాగ్యమ్మ, జంగయ్య, మల్లేష్, కిష్టయ్య, బాలకిష్ట, సుగుణమ్మ, యాదమ్మ, చంద్రమ్మ, ఎల్లేష్, దయాకర్, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాటుకాల్వ ఆక్రమణల పరిశీలన



పాటు కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: సాయిరెడ్డి చెరువు నుంచి కాశన్నకుంటకు వరద నీరు వచ్చే ప్రధాన పాటు కాల్వ ఆక్రమణ, కబ్జాలకు గురైందని ఆరోపిస్తు స్థానిక నాయకుడు శివాచారి ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ డీఈ ప్రసన్నరాణి, ఏఈ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాములు, ఆయా శాఖల అధికారులు శుక్రవారం కాల్వను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతేకాకుండా జాతీయ రహదారి నుంచి గణపతి కాలనీ వరకు గతంలో పాటు కాల్వ ప్రవహించిన తీరును రికార్డుల ఆధారంగా గుర్తించారు. కాగా కాల్వ వెడెల్పు ఆధారంగా మరోమారు సర్వేలు చేపట్టి ఆక్రమణ, కబ్జాలకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. కాల్వ వెడెల్పుతో పాటు పలు వివరాల కోసం మున్సిపల్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు లేఖ రాయాలని డీఈ సూచించారు. సాధ్యమైనంత త్వరలో వివరాలు తీసుకుని ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు అధికారులను కోరారు.

టీయూపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి విజయశాంతి

శంకర్‌పల్లి: విద్యార్థుల భవిష్యత్ తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని ప్రముఖ సినీనటి విజయశాంతి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం శంకర్‌పల్లి మండల శాఖ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో టీయూ పీఎస్ శంకర్‌పల్లి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, శ్రీను, జిల్లా మీడియా కన్వీనర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు, నాయకులు చంద్రశేఖర్, రాజేందర్, లక్ష్మారెడ్డి, ఎస్. జంగయ్య, సదానందంగౌడ్, కృష్ణారెడ్డి, కవ్వగూడెం శ్రీను, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీ విజేతలకు బహుమతులు



సర్టిఫికెట్లతో కరాటే పోటీ విజేతలు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40మంది విద్యార్థులు గెలుపొందారు. మాస్టర్ జపాన్ చోటో ఖాన్ కరాటే – డూ అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడారు. కరాటే నేర్చుకుంటే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అమరావతి, కరాటే మాస్టర్ రాము, చీఫ్ ఎగ్జామినర్ మాస్టర్ ఖాజాపాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, రవికాంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- రోడ్డు ప్రమాద బాధితునికి బీఆర్‌ఎస్ నేత ఆర్థిక సహాయం

చేవెళ్ల: ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల యువ నాయకుడు గుడిపల్లి రవికాంత్‌రెడ్డి సమకూర్చిన రూ. 25వేలను ఎమ్మెల్యే రావులపల్లికి చెందిన బుర్ల సురేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందినట్లు తెలిపారు. వైద్యం కోసం రూ. 10లక్షలు ఖర్చు చేయడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రవికాంత్‌రెడ్డి తనవంతుగా రూ. 25వేలు ఇచ్చినట్లు తెలిపారు. పేదలకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పి.ప్రభాకర్, కావలి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్, విఠలయ్య తదితరులు పాల్గొన్నారు.